క్లుప్తంగా

వైభవంగా కల్యాణోత్సవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్టిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన కల్యాణోత్సవంలో ఆలయ అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు, పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ, పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కల్యాణోత్సవం అనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తిరిగి స్వామి వారి ఆలయానికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉభయ దాతలు, భక్తులను ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. .

ఎస్ఎన్‌పురం పీఎస్ పరిధిలో ఫుట్ పెట్రోలింగ్



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో శాంతి భద్రతలు పరిరక్షణలో భాగంగా నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఉత్తర్వుల ప్రకారం ఎస్ఎస్‌పురం, గవర్నరుపేట పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ, గవర్నరుపేట ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబులు సిబ్బందితో కలిసి అలంకార్ సెంటర్, బీఆర్టీఎస్ రోడ్డు, గాంధీనగర్ తదితర ప్రాంతాలలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ముఖ్యంగా మహిళల భద్రత, దిశ యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం పలువురు అనుమానితులను విచారణ చేసి వారి లగేజీలను తనిఖీలు చేశారు.

ఆయుర్వేద వైద్య కళాశాలలో వైద్యశిబిరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు



లాకుల వద్ద గల డాక్టర్ నోరి రామశాస్త్రి ఆయుర్వేద వైద్య కళాశాల కాయ చికిత్స విభాగం నందు సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం జరిగింది. శిబిరంలో 150 మందికి రక్త, మూత్ర పరీక్షలు, ఈసీజీ నిర్వహించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిసుధాకర్, వైద్యులు బుల్లయ్య, కూరపాటి శ్రీనివాస్ పాల్గొని రోగులకు పలు సూచనలు చేశారు. ఆయుర్వేదంలో అనేక రోగాలకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. శిబిరంలో పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లీ కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): తల్లీ కుమార్తె అదృశ్యమైన ఘటనపై నున్న పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాది కుంభ వాకలయ్య రాధానగర్‌లో నివాసం ఉంటూ చేపల వ్యాపారం చేస్తాడు. ఫిర్యాదు భార్య శిరీషా(28) చేపలు విక్రయిస్తుంటుంది. మనస్పర్థలతో ఈ నెల 10వ తేదీన తన ఏడేళ్ల కుమార్తెను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంటికి తిరిగి రాలేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తిరుపతికి వెళ్లిన తన కుమారుడు తిరిగి రాలేదంటూ ఓ తండ్రి ఫిర్యాదు మేరకు సోమవారం అజిత్ సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామలింగేశ్వరపేటకు చెందిన అల్లాడ దుర్గారావుకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడు అల్లాడ వరప్రసాద్(48) రాజీవ్‌నగర్ ఉడా కాలనీలో కుమార్తె, కుమారుడుతో కలిసి ఉంటున్నారు. వరప్రసాద్ తరచూ రామలింగేశ్వరపేటలోని తండ్రి ఇంటికి వచ్చి వెళుతూ ఉంటారు. ఈ క్రమంలో మే 20వ తేదీన రామలింగేశ్వరపేటలోని తండ్రి వద్దకు వచ్చి రూ.500 నగదు, రెండు జతల బట్టలు తీసుకుని తిరుపతి వెళుతున్నానని చెప్పి బయలుదేరి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. గతంలో కూడా పనుల నిమిత్తం బయటకు వెళ్లిన వరప్రసాద్ రెండు మూడు రోజులకు తిరిగి వచ్చేవాడు. దీంతో కుమారుడు వచ్చేస్తాడనే భరోసాతో ఉండిపోయారు. కానీ ఇప్పటి వరకు తిరిగి రాకపోవటంతో సోమవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.









ఆత్మీయ కలయిక

గుంటూరు జిల్లా అమరావతిలో కృష్ణాయపాలెంలో సోమవారం జరిగిన పేదల ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు. సీఎంకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యే విష్ణు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



రైల్వే హాస్పిటల్‌లో ఉచిత లివర్ స్క్రీనింగ్ క్యాంప్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే హాస్పిటల్‌లోని రేడియాలజీ బ్లాక్‌లో సోమవారం ఉచిత లివర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. శిబిరానికి ముఖ్య అతిథిగా హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం కోసం జైడస్ లైఫ్ సైన్సెస్ సహకారంతో ఉచిత ఫైబ్రో స్కాన్(లివర్) స్క్రీనింగ్ క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. 75 మంది ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించగా, వారిలో ఫైబ్రో స్కాన్‌లో అసాధారణ లక్షణాలు ఉన్న పలువురిని గుర్తించి తదుపరి చికిత్స నిమిత్తం గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్‌కు రిఫర్ చేశామని చెప్పారు. లివర్ సంబంధిత వ్యాధులను నివారించడానికి ఆరోగ్యకరమైన సమతుల్య ఆహార నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్‌లు డాక్టర్ ఎల్.రవికాంత్, డాక్టర్ ఎం.జయదీప్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగికి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు ప్రజలే సాక్ష్యం

- 59వ డివిజన్‌లో 2,782 మందికి సర్టిఫికెట్లు, 14 మందికి రేషన్ కార్డులు పంపిణీ
- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారులే నిలువెత్తు సాక్ష్యమని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59వ డివిజన్ అజిత్ సింగ్‌నగర్‌లోని గుజ్జల సరళాదేవి కల్యాణ మండపంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఒక సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసి.. చెప్పిన తేదీకే లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదును జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో సంక్షేమ విప్లవం జరుగుతుందని ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రజలతో మమేకమవుతూ సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేసే ప్రయత్నంలో మొత్తం ప్రభుత్వ యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. జగనన్న సురక్ష ద్వారా వీలైనంత ఎక్కువ సేవలను ఇంటింటి సర్వే ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. క్యాంపులు ఏర్పాటు చేసి 11 రకాల సర్టిఫికెట్లను ఎటువంటి యూజర్ చార్జీలు లేకుండా అందజేస్తున్నట్లు వెల్లడించారు.

7,211 మందికి ఇళ్ల మంజూరు

59వ డివిజన్లలో 742 మందికి కుల, 1,066 మందికి ఆదాయ, ఏడుగురికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ 14 మందికి బియ్యం కార్డులతో పాటు వివిధ రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశామని ఎమ్మెల్యే విష్ణు చెప్పారు. అలాగే ఆర్ 5 జోన్‌లో పేదలకు ఇళ్ల పట్టాలివ్వకుండా తెలుగుదేశం పార్టీ పన్నిన కుట్రలు, అవరోధాలను అధిగమించి 50,793 మంది అక్కచెల్లెమ్మల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించుకోవడం శుభపరిణామమన్నారు. వీరిలో సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి 7,211 మంది లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు.

స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినాసుల్తానా మాట్లాడుతూ.. మాట మీద నిలబడే వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండటం నియోజకవర్గ ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టేందుకు ఇటీవల అర్ధరాత్రి ఆయన చేసిన డివిజన్ పర్యటన.. ప్రజా సమస్యల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా దరఖాస్తుదారులకు 2,782 సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పీఓయూసీడీ శకుంతల, నార్త్ ఎమ్మార్వో మాధురి, అసిస్టెంట్ కమిషనర్ -2 అనసూయ, నాయకులు హాఫీజుల్లా, నందెపు సురేష్, కంభగళ్ల రాజు, నాగుల్ మీరా, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చిన సీఎం జగన్



శంకుస్థాపనకు బయలుదేరిన లబ్ధిదారులు

పాయకాపురం(విజయవాడరూరల్): పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని కార్పొరేటర్లు ఉమ్మడి రమాదేవి, అలంపూరు విజయలక్ష్మి, మోదుగుల తిరుపతమ్మ, యర్రగొర్ల తిరుపతమ్మ తెలిపారు. అమరావతిలో పేదల ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమానికి పలు డివిజన్ల నుంచి లబ్ధిదారులు ఆనందోత్సాహాలతో బయలుదేరి వెళ్లారు. 61వ డివిజన్ నుంచి 364 మంది లబ్ధిదారులు, 62వ డివిజన్ నుంచి 386 మంది, 63వ డివిజన్ నుంచి 14 మంది, 64వ డివిజన్ నుంచి 74 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను ప్రభుత్వం మంజూరు చేసింది. లబ్ధిదారులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆయా డివిజన్ల పార్టీ నాయకులు బస్సుల్లో అమరావతికి వెళ్లారు.

శంకుస్థాపనకు పయనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్నో కుట్రలు కుతంత్రాలను చేదించి పేదల పక్షాన పోరాటం చేసి సీఆర్‌డీఏ పరిధిలో ఇంటి పట్టాను అందించి పేదల సొంతింటి కలసాకారం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. స్థానిక 31వ డివిజన్ నుంచి సీఆర్డీఏ పరిధిలో సోమవారం భూమిపూజకు లబ్ధిదారులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలను అందించటంతో పాటు సొంతింటి కలను సాకారం చేశారన్నారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల్లో లబ్ధిదారులు భూమి పూజకు ఉత్సాహంగా వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో..

32వ డివిజన్ నుంచి భూమిపూజకు లబ్ధిదారులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కో ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి మాట్లాడుతూ సీఆర్‌డీఏ పరిధిలో పట్టాను ఇవ్వటంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం 61 మంది లబ్ధిదారులు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్, నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్ పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): సీఆర్డీఏ పరిధిలోని వెంకటపాలెం, కృష్ణాయపాలెంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేతుల గృహ నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమనికి వెళ్లే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. విజయవాడ నగరంలోని బీఆర్టీఎస్ రోడ్డు, కుమ్మరిపాలెం సెంటర్ షాదీఖానా, భవానిపురం బాబ్బురి గ్రౌండ్, కృష్ణలంక సర్వీసు రోడ్డులో వీఎంసీ ఏర్పాటు చేసిన బస్సులను పరిశీలించారు.

స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించాలి

మున్సిపల్ అధికారులు



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న మున్సిపల్ అధికారులు

పటమట(విజయవాడతూర్పు): స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు వేగంగా పరిష్కరించాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందనలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి, వారి సమస్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు.

పలు సమస్యలపై ఆరు అర్జీల అందజేత

అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. గత వారం వచ్చిన సమస్యల పరిష్కారంపై అదనపు కమిషనర్ సత్యవతి అధికారులతో సమీక్షించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. స్పందనలో ఆరు సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. వాటిలో ఇంజినీరింగ్ విభాగం – 2, పబ్లిక్ హెల్త్ విభాగం- 2, పట్టణ ప్రణాళిక విభాగం, ఉద్యానవన విభాగం నుంచి ఒక్కో అర్జీ వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్(అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లతా, ఎస్ఈ రామ్మోహన్ రావు, ఎస్టేట్ ఆఫీసర్ ఓ.శ్రీనివాస్, మేనేజర్ బి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లయోల కాలేజీని సందర్శించిన ఎన్‌సీసీ డీడీజీ



గుణదల(విజయవాడ తూర్పు): ఎన్‌సీసీ డీడీజీ వి.ఎం.రెడ్డి ఆంధ్రా లయోల కళాశాలను సోమవారం సందర్శించారు. కళాశాల పూర్వ విద్యార్థి అయిన వి.ఎం.రెడ్డి డీడీజీగా బాధ్యతలు తీసుకోవడం పట్ల కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు. కళాశాలకు విచ్చేసిన డీడీజీ వి.ఎం.రెడ్డికి ఎన్‌సీసీ క్యాడెట్లు ఘనంగా స్వాగతం పలికారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో తన అనుభవాలను ఆయన విద్యార్థులకు వివరించారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి ఎన్‌సీసీ దోహదపడుతుందన్నారు. అనంతరం నావల్ యూనిట్ రోయింగ్ స్టిమ్‌లేటర్స్‌ను పరిశీలించారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎ.కె.రుషి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దుర్గాప్రసాద్

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కంటి వెలుగు సేవలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని నేత్ర వైద్యుడు దుర్గాప్రసాద్ సూచించారు. స్థానిక గులాబీతోట 200వ వార్డు సచివాలయంలో సోమవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సతో పాటు కళ్లజోళ్లను అందిస్తున్నామన్నారు. అనంతరం వృద్ధులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్.రామకృష్ణప్రసాద్, వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్ కొండాయగుంట రాము, డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్, గుర్రం ఏడుకొండలు, ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల స్థాపనలో అయ్యంకి కృషి ఎనలేనిది



ఠాగూర్ గ్రంథాలయంలో విజేతలతో చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ, మురళీకృష్ణ



అయ్యంకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామ్మోహన గ్రంథాలయ కమిటీ సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రంథాలయాల స్థాపనలో అయ్యంకి వెంకట రమణయ్య ఎనలేని కృషి చేశారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ, వెంకట రమణయ్య మనవడు అయ్యంకి మురళీకృష్ణ అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి 133వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, సరస్వతీ సామ్రాజ్య అధ్యక్షుడు మురళీకృష్ణలు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయవాడలోని రామ్మోహన్ గ్రంథాలయం స్థాపనలో అయ్యంకి కీలక పాత్ర పోషించారన్నారు. అనంతరం మురళీకృష్ణను సత్కరించారు. క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఠాగూర్ గ్రంథాలయంలో కూచిపూడి నృత్య శిక్షకులు భాగవతుల సీతారామ శర్మను సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది జి.ఉమారాణి, డి.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రంథాలయ ఉద్యమ సేవకు పద్మశ్రీ అవార్డు అందుకున్న ఏకైక వ్యక్తి అయ్యంకి వెంకటరమణయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. రామ్మోహన గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతిని సోమవారం నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, కార్యదర్శి వేములపల్లి కేశవరావు, అయ్యంకి మనువడు సరస్వతీ సామ్రాజ్య అధ్యక్షుడు అయ్యంకి మురళీ కృష్ణ వెంకట రమణయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్ర గ్రంథాలయ సంస్థ స్థాపనకు అయ్యంకి చేసిన కృషిని కొనియాడారు. దమ్మాల రామచంద్రరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

నగరంలో బేబి చిత్ర యూనిట్ సందడి



హీరోలు ఆనంద్, అశ్విన్, హీరోయిన్ వైష్ణవి, దర్శక నిర్మాతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలో బేబి చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్ర విజయోత్సవంలో భాగంగా చిత్రం ప్రదర్శిస్తున్న రాజ్ యువరాజ్ థియేటర్‌కు హీరోలు ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, హీరోయిన్ వైష్ణవి సోమవారం విచ్చేసి, ప్రేక్షకులతో మాట్లాడారు. చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హీరోలు ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ.. బేబి కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రమన్నారు. యూత్ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రంగా యువతను ఆకట్టుకుందన్నారు. నెల్లూరు నుంచి తమ విజయ యాత్ర ప్రారంభించినట్లు చెప్పారు.

ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నామన్నారు. విజయవాడ ప్రేక్షకులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. హీరోయిన్ వైష్ణవి క్యారెక్టర్‌కి మూవీలో మంచి ఆదరణ వచ్చిందని తెలిపారు. కథ విన్నప్పుడు చాలా కొత్తదనంగా అనిపించిందన్నారు. తదనంతరం హీరోయిన్ వైష్ణవి మాట్లాడుతూ.. బేబి చిత్రంలో అవకాశం రావడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో చిత్ర దర్శకుడు సాయి రాజేష్, నిర్మాత ఎస్‌కే.ఎన్ పాల్గొన్నారు.



జోరు వానలో నిలిచిన ట్రాఫిక్

నగరంలో సోమవారం ఉదయం నుంచి జోరు వాన కురిసింది. దీంతో నగర వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం కాలేజీ విద్యార్థులు ఇంటిబాట పట్టడంతో బెంజ్‌సర్కిల్‌లో భారీగా ట్రాఫిక్ నిలిచింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ముగిసిన కుట్టుమిషన్ శిక్షణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేద మహిళల స్వయం ఉపాధి కోసం వాసవీ క్లబ్ విజయవాడ లోటస్, లోటస్ యూత్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అప్పన వెంకట సత్యసాయి బాబు సహకారంతో కంచర్ల పద్మావతి మూడు నెలల పాటు రెండు బ్యాచ్‌లకు ఇచ్చిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పూర్తయ్యింది.